క్లుప్తంగా

వైఎస్సార్ సీపీ నాయకుడి మృతి


యేజర్ల మోషే

ఇంకొల్లు (చినగంజాం): ఇంకొల్లు స్టాలిన్‌పేటకు చెందిన సీనియర్ వైఎస్సార్ సీపీ నాయకుడు యేజర్ల మోషే (67) శుక్రవారం స్వగ్రామంలో ఆకస్మికంగా మృతి చెందినట్లు మండల పార్టీ కన్వీనర్ బండారు ప్రభాకరరావు తెలిపారు. గత పదేళ్లుగా పార్టీ అభివృద్ధికి ఎనలేని కృషి చేశారని, ఆయన రెండు పర్యాయాలు ఇంకొల్లు పంచాయతీ వార్డు సభ్యుడిగా కూడా పనిచేసినట్లు తెలిపారు. మోషే మృతిపట్ల నియోజకవర్గ పరిధిలోని పలువురు పార్టీ నాయకులు సంతాపం తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అద్దంకి రూరల్: అద్దంకి సౌత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల నిమిత్తం శనివారం ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు సబ్‌స్టేషన్ పరిధిలోని దక్షిణ అద్దంకి, నాగులపాడు, వేలమూరిపాడు, జార్లపాలేనికి విద్యుత్ సరఫరా అంతరాయం కలుగుతుందన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

భవిత కేంద్రానికి కుర్చీల బహూకరణ


కుర్చీలను బహూకరించిన దాతతో అతిథులు

మేదరమెట్ల: కొరిశపాడు మండలంలోని మేదరమెట్లలో గల భవిత సెంటర్‌కు చిలకలూరిపేటకు చెందిన కే.అనిల్ 15 కుర్చీలను శుక్రవారం బహూకరించారు. ఈసందర్భంగా ఎంఈవో-2 బీ.వీరరాఘవయ్య మాట్లాడుతూ దాతలు ఎంతో ఉదార స్వభావంతో అందజేస్తున్న వస్తువులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఫిజియోథెరపిస్టు ఇందిరా ప్రియదర్శిని, ఐఈఆర్‌టీ కొండయ్య, అజయ్‌కుమార్, రవిశేఖర్, సంధ్యారాణి, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గ్రామసభలో 36 అర్జీల స్వీకరణ


సభలో అర్జీలు స్వీకరిస్తున్న అధికారులు

చినగంజాం: రీ సర్వే నిర్వహించిన భూముల్లో సమస్యలను పరిష్కరించే కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న రెవెన్యూ గ్రామసభ శుక్రవారం మండలంలోని చింతగుంపల గ్రామంలో నిర్వహించారు. గ్రామ సభలో 36 మంది రైతులు తమ భూ సమస్యలకు సంబంధించి అర్జీలను అందజేశారు. కార్యక్రమంలో రీ సర్వే డీటీ సుజాత, వీఆర్వోలు నాగేశ్వరరావు, సత్యనారాయణ, నాగరాజు, రైతులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

మార్టూరు: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొంతుతూ ఓవ్యక్తి మృతి చెందాడు. ఏఎస్సై మహబూబ్ బాషా వివరాల మేరకు.. యద్దనపూడి మండలం చింతపల్లిపాడు గ్రామానికి చెందిన పాలపర్తి బాలకృష్ణ (47) బొల్లాపల్లి టోల్‌గేట్ సమీపంలోని హోటల్లో సెక్యూరిటీ గార్డ్‌గా పనిచేస్తున్నాడు. గత బుధవారం ఈనెల 23వ తేదీ రాత్రి తన పనులు ముగించుకున్న బాలకృష్ణ హోటల్ దగ్గర నుంచి టీవీఎస్ వాహనంపై గ్రామానికి బయలుదేరాడు. కోలలపూడి క్రాస్ రోడ్ సమీపంలో బాలకృష్ణ బైకును గుర్తుతెలియని వాహనం ఢీకొట్టి వెళ్లిపోయింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన బాలకృష్ణను గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి అదే రోజు తరలించగా చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో శుక్రవారం ఉదయం మృతి చెందినట్లు ఏఎస్ఐ తెలిపారు. మృతుడి కుమారుడు రాజేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

స్కూటీని ఢీకొన్న ఆటో

చీరాల: స్కూటీని ఆటో ఢీకొన్న ఘటనలో భార్యాభర్తలకు గాయాలయ్యాయి. ఈఘటన రామాపురం రోడ్డులో చోటుచేసుకుంది. రామకృష్ణాపురానికి చెందిన సీహెచ్ బాలవెంకటేశ్వర్లు దంపతులు రామాపురం నుంచి రామకృష్ణాపురం వస్తుండగా ఆటో ఢీకొంది. ప్రమాదంలో బాలవెంకటేశ్వర్లు భార్యకు తీవ్రగాయాలు కావడంతో ఆమెను హుటాహుటిన మెరుగైన వైద్యం నిమిత్తం విజయవాడ తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

పని చేయరు.. పాటించరు !

- నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఎంఈవోలు
- స్కూల్ రికార్డుల్లో బోగస్ రోల్
- తమ పోస్టులు కాపాడుకోవడం కోసం ప్రయత్నం
- ప్రైవేట్ బడుల్లో ఉన్న విద్యార్థుల పేర్లు నమోదు చేస్తున్న వైనం
- పాఠశాల నిర్వహణకు విడుదల కాని నిధులు



వేటపాలెం విద్యాశాఖ విద్యావనరుల కేంద్రం

వేటపాలెం: ఆంధ్రప్రదేశ్ చరిత్రలో ప్రభుత్వ పాఠశాలలు బాగుపడ్డాయంటే అది గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలోనే. విద్య, వైద్యం, వ్యవసాయం రంగాలకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చి అభివృద్ధి బాటలో నడిపించారు అప్పటి సీఎం జగన్ మోహన్ రెడ్డి. నాడు-నేడు కింద పాఠశాలలను కార్పొరేట్ స్థాయికి దీటుగా తీర్చిదిద్ది దేశం మొత్తం రాష్ట్రం వైపు చూసేలా చేశారు. అలాంటిది నేడు కూటమి ప్రభుత్వంలో పాఠశాలలకు గ్రహణం పట్టింది. గత ప్రభుత్వంలో ప్రతి మండలానికి విద్యాశాఖ పర్యవేక్షణ కోసం ఇద్దరు చొప్పున ఎంఈవోలను ఏర్పాటు చేసింది. దీనితో పేద విద్యార్థులకు చేరువైన నాణ్యమై విద్యను ప్రస్తుత కూటమి ప్రభుత్వం వచ్చాక నిర్వీర్యం చేసింది. ఇప్పటివరకు తల్లికి వందనం ఊసే ఎత్తని ప్రభుత్వం సర్కారీ బడులను గాలికి వదిలేసింది. సర్కారు బడులపై పర్యవేక్షించాల్సిన జిల్లా, మండల అధికారులు వాటిని నిర్లక్ష్యం చేస్తున్నారు. దీన్ని అసరాగా తీసుకొని ఉపాధ్యాయులు వారి ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ విద్యావ్యవస్థను నీరుగారుస్తున్నారని విద్యార్థుల తల్లిదండ్రులతో పాటు కొందరు ఉపాధ్యాయులు ఆరోపిస్తున్నారు.

రికార్డుల్లో బోగస్ రోల్.. భౌతికంగా ప్రైవేట్ పంచన

కూటమి ప్రభుత్వ కారణంగా సర్కారు బడుల్లో చదువుతున్న విద్యార్థులు వారి తల్లిదండ్రులు తిరిగి ప్రైవేట్ స్కూళ్లకు పంపిస్తున్నారు. దీనితో సర్కారు బడుల్లో విద్యార్థుల సంఖ్య క్రమంగా తగ్గి పోయింది. ఇదే అదనుగా ఆయా పాఠశాల్లో పనిచేసే ఉపాధ్యాయులు వారి బదీలీలను కాపాడుకోవడం కోసం అడ్డదారులు తొక్కారు. రికార్డుల్లో ప్రైవేటు స్కూళ్లలో చదువుకునే పిల్లల పేర్లు నమోదు చేసి తగినంత మంది పిల్లలు ఉన్నట్లు ఉన్నతాధికారులకూ నివేదికలు పంపిస్తున్నారు. దీనికి నిదర్శనం నాయినపల్లి ఎంపీపీఎస్ వెస్ట్ స్కూల్‌లో రికార్డుల్లో 101 మంది విద్యార్థులను నమోదు చేసి ఉంది. భౌతికంగా కేవలం 80 విద్యార్థులు 1 నుంచి 5 తరగతుల వరకు ఉన్నారు. ఇక్కడ ఒక పోస్టు అదనంగా ఉంది. అదే మాదిరిగా వేటపాలెం ఓఆర్ఎస్ ఎంపీపీఎస్ స్కూల్‌ల్లో రికార్డుల్లో 181 మంది విద్యార్థులు నమోదై ఉన్నారు. ఈ స్కూల్‌లో ఐదుగురు టీచర్లు ఉండాల్సి ఉండగా ప్రస్తుతం 9 మంది ఉన్నారు. ఇదే విధంగా సగం పాఠశాలల్లో బోగస్ రోల్‌తో టీచర్స్‌కు దగ్గరగా ఉండే స్కూల్‌లో ఉండేందుకు నమోదు చేసుకుంటున్నారని మరి కొంత మంది ఉపాధ్యాయులు ఆరోపిస్తున్నారు.

సర్దుబాట్లలో బయటపడిన లోపాలు..

మండల పరిధిలోని ప్రభుత్వ బడుల్లో ఉపాధ్యాయులు సర్దుబాటుల్లో అధికారులు కొంతమంది ఉపాధ్యాయులకు అనుకూలంగా వ్యవరించారని ఉపాధ్యాయులే బహిరంగా ఆరోపిస్తున్నారు. హైస్కూల్స్‌కి జూనియర్ ఉపాధ్యాయులను, ఎలిమెంటరీ స్కూల్స్‌కి సీనియర్ ఉపాధ్యాయులను సర్దుబాటు చేసిన వైనం రెండు నెల కిందట బహిర్గతం అయింది. దీనిలో అన్యాయం జరిగిన ఉపాధ్యాయులు ఏకంగా విద్యాశాఖ కమిషనర్‌కి సర్దుబాటులో జరిగిన లోపాలపై ఫిర్యాదు చేశారు.

గ్రాంట్ కోసం ఎదురు చూపులు..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సర్కారు బడుల నిర్వహణ గ్రాంటు ఎప్పుడు వస్తుందో తెలియని పరిస్థితి. గతంలో అమ్మఒడి పథకం నుంచి కొంత మినహాయించి నిధులు అందజేసేవారు. ప్రస్తుతం తల్లికి వందనం ఈ ఏడాది ఇస్తారో లేదో తెలియని పరిస్థితి. ఒక వేళ ఇవ్వకపోతే ఇక నిర్వహణ గ్రాంటు పరిస్థితి ఏంటోనని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. గ్రాంటు ఇవ్వని బడుల్లో చాక్‌పీస్, డస్టర్, మైనర్ రిపేర్లకు జేబులో నుంచి డబ్బులు ఖర్చు చేయాల్సిన పరిస్థితి వస్తుందని హెచ్‌ఎంలు ఆందోళన చెందుతున్నారు. తాగునీరు, విద్యుత్ బిల్లుల చెల్లింపులు, విద్యాబోధనకు అవసరయ్యే సామగ్రి, సమావేశాలకు అవసరమయ్యే ఖర్చులు, బెంచీలు, తలుపులు వంటి చిన్న చిన్న మరమ్మతులకు నగదు పరిస్థితి ఏమిటని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా మండల స్థాయి అధికారుల కళ్లు తెరిచి సర్కారు బడులను కాపాడాలని తల్లిదండ్రులు, పలువురు ఉపాధ్యాయులు కోరుతున్నారు.

> **పాఠశాలలను తనిఖీలు చేస్తాం..**
> సర్కారు బడులను తనిఖీలు చేసి బోగస్ రోల్ నమోదు చేసిన వారిపై చర్యలు తీసుకుంటాం. టీచర్ల సర్దుబాటుల్లో వచ్చిన ఆరోపణలు సరికాదు. బడి నిర్వణ నిధులు ఇంకా విడుదల కాలేదు.
> – జేవీ సుబ్బయ్య ఎంఈఓ, వేటపాలెం

ఆర్టీసీ బస్సు డ్రైవర్ నిర్లక్ష్యం



108కు దారి ఇవ్వకుండా అడ్డుగా ఉన్న ఆర్టీసీ బస్సు

జే.పంగులూరు: ప్రాణాలను కాపాడే 108 వాహనాన్ని వెళ్లకుండా అడ్డుకున్నాడు ఆర్టీసీ డ్రైవర్. మండలానికి సంబంధించిన 108 వాహనం శుక్రవారం బూదవాడ కేసు నిమిత్తం పంగులూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి బయలుదేరింది. బూదవాడ వైపు వెళ్తుండగా అడ్డుగా అద్దంకి ఆర్టీసీ డిపోకు చెందిన బస్సు వచ్చింది. బస్సు కాస్త పక్కకు తిప్పండి ముందుకు వెళ్తాను అత్యవసర కేసు అని పైలట్ చెప్పినా ఆర్టీసీ డ్రైవర్ వినలేదు. చుట్టు పక్కలవారు చెప్పిన కూడా బస్సు డ్రైవర్ నిర్లక్ష్య వైఖరితో 'నీ దిక్కున్న చోట చెప్పుకో..' అని దురుసుగా ప్రవర్తించాడు. చేసేది లేక అంబులెన్స్ వెనక్కి వెళ్లి బస్సుకు దారి ఇవ్వాల్సిన పరిస్థితి వచ్చింది. దీంతో అక్కడ ఉన్న స్థానికులు బస్సు డ్రైవర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు.

27 వరకు పంట నష్టం అంచనా


మినుము పంటను పరిశీలిస్తున్న అధికారులు

జే.పంగులూరు: తుఫాన్ కారణంగా నష్టపోయిన మినుము పంటను పరిశీలించి వివరాలు నమోదు చేశారు. మండలంలోని ముప్పవరం గ్రామంలో వర్షాలకు మినుము పంట నష్టపోయిన గణనను శుక్రవారం మండల వ్యవసాయాధికారి డీ సుబ్బారెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ అధిక వర్షాలకు కోత దశలో ఉన్న 33 శాతం మినుము పంట నష్టపోయిందన్నారు. రైతులను గుర్తించడానికి గ్రామస్థాయిలో వీఆర్వో, వీఆర్‌ఏ, ఏఎస్ఓలను, మండల టీములను, డివిజన్ స్థాయిలో డివిజనల్ రెవెన్యూ అధికారిణి, సహాయ వ్యవసాయ సంచాలకులను, సూపర్ వైజర్లను నియమించినట్లు తెలిపారు. ఈనెల 23వ తేది నుంచి పంట నష్టపోయిన పొలాలను పరిశీలించి జాబితా తయారు చేయనున్నట్లు తెలిపారు. 27వ తేదీ వరకు పంట నష్టంపై అంచనా వేస్తామని తెలిపారు. నవంబర్ 2,3 తేదీల్లో అధికారులు సామాజిక తనిఖీ కోసం తుది జాబితాను పంపుతామని ఏవో పేర్కొన్నారు. పంటను పరిశీలించిన వారిలో మాజీ జెడ్పీటీసీ కుక్కపల్లి ఏడుకొండలు, రైతులు పాల్గొన్నారు.

20 మంది శుక్లాల ఆపరేషన్‌కు తరలింపు


కళ్లజోళ్లు అందిస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

అద్దంకి రూరల్: రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ, ఉమ్మడి ప్రకాశం జిల్లా అంధత్వ నివారణ సంస్థ, శంకర నేత్రాలయం సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక అంబేడ్కర్ భవన్‌లో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ఈశిబిరంలో నేత్రాలయం సిబ్బంది, ఆప్తమాలజిస్టు ఉమాదేవి 40 మందిని పరీక్షించారు. వీరిలో శుక్లాల ఆపరేషన్ అవసరమైన 20 మందిని పెదకాకాని శంకర నేత్రాలయానికి పంపారు. మందులు అవసరమైనవారికి ఉచితంగా మందులు అందజేశారు. గత నెలలో శుక్లాల ఆపరేషన్ చేయించుకున్నవారికి కొత్త కళ్లజోళ్లు అందజేశారు. కార్యక్రమంలో రోటరీక్లబ్ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య,సెక్రటరీ చుండూరి మురళీ సుధాకరరావు సహాయ కార్యదర్శి అళహరి హరిప్రసాద్, ట్రెజరర్ మలాది శ్రీనివాసరావు, సహాయ గవర్నర్ షేక్ మహమ్మద్ రఫీ, సందిరెడ్డి శ్రీనివాసరావు, జ్యోతి చంద్రమౌళి, దేవపాలన, కాకర్ల వెంకటేశ్వర్లు, చామర్తి గుణశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అవగాహనతో బాల్యవివాహాలకు చెక్


బాల్యవివాహాల అనర్థాలపై మాట్లాడుతున్న ఎంపీడీవో

బల్లికురవ: బాలల హక్కుల పరిరక్షణతో పాటు, బాల్యవివాహాలకు చెక్ పెట్టాల్సిన బాధ్యత ఉందని ఎంపీడీవో కుసుమ కుమారి అన్నారు. శుక్రవారం పరిషత్ కార్యాలయంలో బాలల హక్కుల పరిరక్షణ, బాల్యవివాహాల నిర్మూలనపై సదస్సు నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ ఆడపిల్లల చదువు ఆ ఇంటికి వెలుగునిస్తుందని, జీవితంలో రాణించేవరకు చదివించి ఆ తర్వాత వివాహం చేయాలన్నారు. బాల్య వివాహాల వల్ల జరిగే జరితే అనర్థాలను వివరించారు. సదస్సులో ఎంపీపీ బడుగు శ్రీలక్ష్మి, ఐసీడీఎస్ సీడీపీవోసరి సుధ, పీహెచ్‌సీ వైద్యాధికారి మమత, ఎంఈవో-2 రమేష్‌బాబు, ఎంవీ ఫౌండేషన్ కో ఆర్డినేటర్ హరిహరరెడ్డి పాల్గొని మాట్లాడారు.

డ్రై డేతో దోమల నివారణ


తొట్టిలో నిల్వ ఉన్న నీటిని బయటకు పారబోస్తున్న వైద్య సిబ్బంది

జే.పంగులూరు: గ్రామాల్లో ప్రతి శుక్రవారం డ్రై డేగా పాటించడం వల్ల దోమలను నివారించవచ్చని వైద్య, ఆరోగ్య సిబ్బంది పేర్కొన్నారు. శుక్రవారం పంగులూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో డ్రై డే కార్యక్రమం నిర్వహించారు. ఆరోగ్య సిబ్బంది ఇంటింటి తిరిగి పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వకుండా చూసుకోవాలని, వ్యక్తిగత పరిశుభ్రత ఎంతో అవసరం అని తెలిపారు. దోమలకు నివాసాలైన కొబ్బరి బోండాలు, రోలు, తొట్లు, కూలర్లు, డబ్బాల తదితర వాటిలో నీరు నిల్వకుండా చూసుకోవాలని చెప్పారు.

మ్యాట్‌బాల్ క్రికెట్ టోర్నమెంట్‌కు విద్యార్థులు


టోర్నమెంట్‌కు ఎంపికైన విద్యార్థులు

చీరాల అర్బన్: మ్యాట్ బాల్ స్టేట్ క్రికెట్ టోర్నమెంట్‌కు పెరీరాస్ ఇంగ్లిషు మీడియం విద్యార్థులు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ సుప్రసన్న శుక్రవారం తెలిపారు. ఈనెల 26 నుంచి 29వ తేదీ వరకు కడప పోలీస్ గ్రౌండ్స్‌లో జరుగుతున్న రాష్ట్రస్థాయి క్రికెట్ టోర్నమెంట్‌కు స్కూల్ విద్యార్థులు తేళ్ల పృథ్వీరాజ్, డి.బంగారిబాబు, పేర్లి సంతోష్, గంట అఖిల్ సన్ని, డి.జాన్సన్‌లు ఎంపికయ్యారన్నారు. స్టేట్ లెవల్ టోర్నమెంట్‌లో మంచి ప్రదర్శన ఇవ్వాలని ఆమె కోరారు. ఎంపికైన విద్యార్థులను పీఈటీ శాంతి వరప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ విజయలక్ష్మి, ఉపాధ్యాయులు అరుణ కుమారి తదితరులు అభినందనలు తెలిపారు.

కాచి చల్లార్చిన నీరు, ఆహారం తీసుకోవాలి


కుంకలమర్రు మెడికల్ క్యాంపులో వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ సురేష్‌బాబు


రాజుబంగారుపాలెంలో అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి, సిబ్బంది

కారంచేడు/చినగంజాం: సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్న తరుణంలో తప్పనిసరిగా కాచి చల్లార్చిన నీరు, వేడివేడిగా తయారు చేసుకున్న ఆహారాన్ని మాత్రమే తీసుకోవాలని కారంచేడు పీహెచ్‌సీ వైద్యుడు డాక్టర్ గోరంట్ల సురేష్‌బాబు పేర్కొన్నారు. శుక్రవారం ఆయన మండల కేంద్రం కారంచేడు గ్రామంలోని లోతట్టు ప్రాంతంగా ఉన్న ఎన్‌టీఆర్ నగర్‌లోను, మండలంలోని కుంకలమర్రు గ్రామంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం, కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో జ్వరాలతో బాధపడుతున్న సుమారు 250 మందికి వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి ఆయన ఉచితంగా మందులు పంపిణీ చేశారు. సీజనల్‌గా దోమల వ్యాప్తి వలన మలేరియా, డెంగీ, టైఫాయిడ్, చికున్ గున్యా వంటి విషజ్వరాలు సైతం వ్యాపించే ప్రమాదముందన్నారు. కార్యక్రమంలో హెచ్‌వీ ఎం వీరమ్మ, హెచ్ఎస్ డీ శ్రీనివాసరావు, మేరీ, సృజన, నాగమల్లేశ్వరి, వసుధ, కరీమా, రోజా, సలోమీ, రాణి, ఏఎన్ఎంలు, ఆశలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నీటి కాలుష్యంతో అనేక వ్యాధులు..

నీటి కాలుష్యం కారణంగా సంక్రమించే వ్యాధులు పట్ల ప్రజలు జాగ్రత్త వహించాలని చినగంజాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఎస్ విజయభాస్కర్ అన్నారు. చినగంజాం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో రాజుబంగారుపాలెం, కొత్తపాలెం గ్రామాల్లో డయేరియా వ్యాధి నిర్మూలన కార్యక్రమంపై డాక్టర్ ముందు జాగ్రత్తగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రం, సచివాలయంలో ఓఆర్ఎస్ ప్యాకెట్‌లు ఉంచారని తెలిపారు. హెల్త్ సూపర్ వైజర్ చిరంజీవి, హెచ్‌వీ ఉల్దారాణి, హెల్త్ అసిస్టెంట్ మురళి, ఏఎన్ఎంఎస్ సువర్ణలత, సుమలత పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం


మోదేపల్లిలో సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి

అద్దంకి: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని మోదేపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రీహర్ష అన్నారు. మోదేపల్లి సచివాలయంలో సీజనల్ వ్యాధులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎప్పటికప్పుడు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, దోమల చేరకుండా మురుగునీటిని తొలగించాలన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సెక్రటరీ అనిల్, ఏఎన్ఎంలు, ఆశలు ఎంపీహెచ్ఈవో ఏ. నాగేశ్వరరావు, పాల్గొన్నారు. అద్దంకి పట్టణంలోని కాకానిపాలెం యూపీహెచ్‌సీ వైద్యురాలు ఎం హేమలత ఆధ్వర్యంలో ఫ్రైడే డ్రైడే నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యశాల సిబ్బంది పాల్గొన్నారు.

గుండ్లకమ్మ నది పూర్తి సర్వేకు శ్రీకారం


గుండ్లకమ్మ నదిలో హద్దులు సర్వే చేస్తున్న సర్వేయర్లు

అద్దంకి రూరల్: కోర్టు ఆదేశాల మేరకు అద్దంకి రెవెన్యూ పరిధిలోని గుండ్లకమ్మ నది విస్తీర్ణం, హద్దులను మండల సర్వేయర్ ఎన్. శ్రీలక్ష్మి, గ్రామ సచివాలయ సర్వేయర్లతో సర్వేను ప్రారంభించారు. శుక్రవారం బ్రిడ్జికి ఉత్తర వైపున నరసింహాపురం పరిధిలో 20 పాయింట్‌లు గుర్తించి ఎరుపు, తెలుపు జెండా కర్రలను పాతారు. తూర్పు వైపున ఏడు భాగాలుగా కొలతలు ఉన్నాయని, నదికి ఇరువైపులా పూర్తి విస్తీర్ణం కొలతలతో హద్దులు నిర్ణయించనున్నట్లు సర్వేయర్ తెలిపారు. కార్యక్రమంలో తిమ్మాయపాలెం, కలవకూరు, చిన్నకొత్తపల్లి సర్వేయర్లు సంధ్య, పవన్‌కళ్యాణ్, అంకమ్మనాయుడు తదితరులు పాల్గొన్నారు.

స్కూటీని ఢీకొన్న టిప్పర్

చీరాల: స్కూటీని టిప్పర్ లారీ ఢీకొన్న ఘటనలో ముగ్గురు మత్స్యకారులకు తీవ్రగాయాలయ్యాయి. ఈఘటన శుక్రవారం చీరాల మండలం వాకావారిపాలెంలో చోటుచేసుకుంది. వాడరేవుకు చెందిన మత్స్యకారులు రాము, రమణ, సురేష్‌లు వాడరేవు నుంచి చీరాల వస్తున్నారు. వాకావారిపాలెం వద్దకు రాగానే స్కూటీని టిప్పర్ లారీ ఢీకొంది. వీరిలో రాము, రమణలకు తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం వీరిని చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. రాము, రమణల పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం నిమిత్తం గుంటూరు తరలించారు. సురేష్ పరిస్థితి నిలకడగా ఉంది. రూరల్ ఎస్సై శివకుమార్ ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసుకున్నారు.

ప్రతిష్ఠకు సిద్ధమవుతున్న సీతారామాలయం


ప్రతిష్ఠకు సిద్ధంగా ఉన్న సీతారామాలయం

బల్లికురవ: మండలంలోని అంబడిపూడి గ్రామంలో సీతారామాలయం పునఃనిర్మాణ పనులు తుదిదశకు చేరి ప్రతిష్ఠకు సిద్ధం అవుతోంది. గ్రామ కూడలిలో దశాబ్దాల క్రితం నిర్మించిన అలయం జీర్ణావస్థకు చేరింది. ఇక్కడే నూతన ఆలయం నిర్మాణ పనులు చేపట్టాలని గ్రామానికి చెందిన యువకులు సంకల్పించారు. వివిధ రంగాల్లో స్థిరపడిన యువకులు ఆలయ పునఃనిర్మాణానికి కమిటీ ఏర్పాటుతో సుమారు రూ. 60 లక్షల అంచనాలతో ఏడాది క్రితం నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టి విగ్రహాలు తయారు చేయించారు. నవంబర్, డిసెంబర్లలో ప్రతిష్టించి కొత్త ఏడాదిలో శ్రీరామనవమి వేడుకలు ఘనంగా నిర్వహించాలని భావిస్తున్నారు.

క్యాన్సర్ వైద్య శిబిరానికి స్పందన


రోగులకు వైద్య సలహాలిస్తున్న డాక్టర్ రఘునందన్

చీరాల రూరల్: ఒంగోలు ఎంఎస్ఆర్ క్యాన్సర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక ప్రభుత్వాసుపత్రిలో ఏర్పాటు చేసిన ఉచిత క్యాన్సర్ వైద్య శిబిరానికి రోగుల నుంచి మంచి స్పందన వచ్చింది. చీరాల, పరిసర ప్రాంతాలకు చెందిన అనేకమంది ప్రజలు పాల్గొని వైద్య సేవలు పొందుకున్నారు. క్యాన్సర్ వైద్య నిపుణులు డాక్టర్ ఆర్‌వీ. రఘునందన్ ఆధ్వర్యంలో రోగులను పరీక్షించి వైద్య సేవలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్యాన్సర్‌ను ముందుగానే గుర్తించి వైద్యుల సలహాలతో వైద్య సేవలు పొందినట్లయితే క్యాన్సర్ భూతం నుంచి భయటపడవచ్చునని తెలిపారు. క్యాన్సర్ అనేక రకాలుగా విస్తరిస్తున్నాయని ముఖ్యంగా మగవారు ధూమపానం, గుట్కాలు, పొగాలు సంబంధిత పదార్థాలను ఉపయోగించవద్దని సూచించారు. మహిళలలో రొమ్ము క్యాన్సర్ వంటివాటిపై జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఆరోగ్యశ్రీ కార్డులు ఉన్నవారికి ఎంఎస్ఆర్ ఆస్పత్రిలో ఉచితంగా వైద్య సేవలు అందిస్తామని చెప్పారు. ప్రజలు అవకావాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.